ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



మహబూబాబాద్

గురువారం 15 ఫిబ్రవరి 2024





మామిడాకులు, ఆనపకాయ, కోడిపిల్లతో కట్టిన తోరణం

- మహాజాతరలో ముఖ్యఘట్టాన్ని నిర్వహించిన వడ్డెలు
- వనదేవతల పూజాసామగ్రిని శుద్ధి చేసిన పూజారులు
- సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజులు, పగిడిద్దరాజు మందిరాల వద్ద పూజలు

రక్షా తోరణం కట్టిన అనంతరం కల్లు, పానకం ఆరబోస్తున్న వడ్డెలు

ద్వార బంధనాలు.. రక్షా తోరణాలు

మేడారంలో ఘనంగా మండమెలిగే పండుగ

భక్తి పారవశ్యం..

మేడారం మహాజాతరలో ముఖ్యఘట్టమైన మండమెలిగే పండుగను బుధవారం ఘనంగా నిర్వహించారు. మేడారంలోని సమ్మక్క కన్నెపల్లిలోని సారలమ్మ, ఏటూరునాగారం మండలంలోని గోవిందరాజులు, గంగారం మండలం పూనుగొండ్లలోని పగిడిద్దరాజు పూజామందిరాల్లో వడ్డెలు (పూజారులు) ఈ వేడుకను ఆదివాసీ సంప్రదాయంలో చేయగా.. వారి కుటుంబసభ్యులు దేవాలయాలను శుద్ధిచేసి అలుకుపూతలు, మామిడి తోరణాలతో అలంకరించారు. అనంతరం డోలు వాయిద్యాలతో గ్రామ పొలిమేరకు చేరుకొని గ్రామదేవతలకు జలాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. దుష్టశక్తులు పొలిమేర దాటి ఊరిలోకి ప్రవేశించకుండా ద్వారస్తంభాలు ఏర్పాటు చేసి.. మామిడాకులు, నల్లకోడి, ఆనపకాయలతో రక్షాతోరణాలు కట్టారు. పానకం, కల్లు, మద్యం ఆరబోశారు. వనదేవతల గద్దెల వద్ద ప్రధాన పూజారులు రాత్రి జాగరణ చేశారు. ఇక మేడారానికి భక్తుల రాక మరింత పెరగనుండగా.. బుధవారం సుమారు 50 వేల మంది దర్శించుకున్నట్టు దేవాదాయశాఖ అధికారులు తెలిపారు. అలాగే ఈనెల 21 నుంచి 24 వరకు జరిగే మహాజాతర కోసం అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. - మేడారం



భక్తులతో కిక్కిరిసిన గద్దెల ప్రాంగణం

వివరాలు 7లో..

జిల్లాలో నలుగురు మునిసిపల్ కమిషనర్ల బదిలీ

- మానుకోటకు నోముల రవీందర్ నియామకం



నోముల రవీందర్

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 14 : జిల్లాలోని తొర్రూరు, మరిపెడ, డోర్నకల్, మానుకోట మునిసిపల్ కమిషనర్లు బదిలీ అయ్యారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా 74 మంది కమిషనర్లను బదిలీ చేస్తూ తెలంగాణ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మహబూబాబాద్ మునిసిపల్ కమిషనర్‌గా పని చేస్తున్న కె.ప్రసన్నారాణి సిద్దిపేటకు, గ్రేటర్ వరంగల్ మునిసిపల్ అడిషనల్ కమిషనర్‌గా పనిచేస్తున్న నోముల రవీందర్ మహబూబాబాద్‌కు బదిలీ అయ్యారు. డోర్నకల్‌లో విధులు నిర్వర్తిస్తున్న మున్వర్ అలీ నల్లగొండ జిల్లా హాలియా మునిసిపాలిటీకి, భువనగిరి యాదాద్రి జిల్లాలోని భువనగిరి మునిసిపల్ మేనేజర్‌గా పని చేస్తున్న బి.నరేష్‌రెడ్డి పదోన్నతిపై డోర్నకల్ మునిసిపల్ కమిషనర్‌గా వస్తున్నారు. మరిపెడ మునిసిపల్ కమిషనర్ ఎ.రాజు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌కు బదిలీ కాగా, వరంగల్ జిల్లా నర్సంపేట కమిషనర్ ఎన్.వెంకటస్వామి మరిపెడకు బదిలీపైరానున్నారు. తొర్రూరు కమిషనర్ పి.సరస్వతి జోగులాంబ గద్వాల జిల్లాలోని అలంపూర్‌కు, కరీంనగర్ జిల్లా చొప్పదండి కమిషనర్‌గా పని చేస్తున్న పి.శాంతికుమార్‌ను జిల్లాలోని తొర్రూరుకు, మరిపెడ మునిసిపల్ మేనేజర్‌గా పని చేస్తున్న ఎస్.మురళీకృష్ణ పదోన్నతిపై మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మునిసిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు.

సేవాలాల్ మార్గాన్ని అనుసరించాలి

- మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్
- తొలిరోజు బోగ్ భండారో కార్యక్రమం ప్రారంభం



అనంతాద్రి వద్ద బోగ్ భండారో కార్యక్రమంలో అగ్నికి నైవేద్యం సమర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్

నెహ్రూసెంటర్, ఫిబ్రవరి14 : గిరిజనుల ఆరాధ్యదైవం శ్రీసంత్ సేవాలాల్ మహరాజ్ చూపినమార్గాన్ని ప్రతీ ఒక్కరు అనుసరించాలనిమాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ అన్నారు. మానుకోట జిల్లా కేంద్రం శివారు అనంతాద్రి సేవాలాల్ ఆలయం వద్ద బుధవారం ఆయన తొలిరోజు బోగ్ భండారో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నికి నైవేద్యం సమర్పించి, మాట్లాడారు. లంబాడీలను స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకుని స్వయం పోషకతండాలుగా తీర్చిదిద్దుకోవాలని చెప్పిన మహనీయుడు సేవాలాల్ మహరాజ్ అని కొనియాడారు. సేవాలాల్ చూపిన సన్మార్గంలో అందరూ నడుచుకోవాలన్నారు. ఈ వేడుకలో గుగులోతు భీమానాయక్, లూనావత్ అశోక్, రాజునాయక్, దామునాయక్, రాందాస్, మంగీలాల్, పలువురు గిరిజన సంఘాల నేతలు పాల్గొన్నారు.

యువకుడి దారుణ హత్య

- కుటుంబ కలహాల నేపథ్యంలో హతమార్చిన అత్తింటివారు
- కళ్లలో కారం చల్లి, బండరాయితో మోది, మెడకు తాడు బిగించి హతం
- భార్యతో విడిగా ఉంటూ సోషల్‌మీడియాలో అనుచిత పోస్టులు పెడుతుండటంపై ఆగ్రహం.. వరంగల్ రంగశాయిపేటలో ఘటన

8లో..

వరంగల్ మార్కెట్‌కు మూడు రోజుల సెలవులు

వరంగల్ టౌన్, ఫిబ్రవరి 14 : వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు మూడో రోజులు సెలవులు ప్రకటించినట్లు మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి సంగయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 16న దేశ వ్యాప్త సమ్మెను పురస్కరించుకుని సెలవు, శనివారం వారాంతపు సెలవు, ఆదివారం సాధారణ సెలవు తిరిగి సోమవారం మార్కెట్లో యథావిధిగా క్రయవిక్రయాలు జరుగుతాయన్నారు.

మానుకోట మార్కెట్ పర్సన్ ఇన్‌చార్జ్‌గా ప్రసాదరావు



మహబూబాబాద్ అగ్రికల్చర్, ఫిబ్రవరి 14 : మానుకోట వ్యవసాయ మార్కెట్ పర్సన్ ఇన్‌చార్జిగా జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారి పాలకుర్తి ప్రసాదరావు బుధవారం పదవీబాధ్యతలు స్వీకరించారు. మార్కెట్ పాలక మండలిని రద్దు చేయడంతో ఆయనను పర్సన్ ఇన్‌చార్జిగా నియమిస్తూ.. రాష్ట్రప్రభుత్వ కార్యదర్శి రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన పదవీబాధ్యతలను చేపట్టారు.

పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు



మానుకోటలో బీజేపీ పార్లమెంట్ కార్యాలయాన్ని ప్రారంభించి, పూజలు చేస్తున్న ధర్మారావు

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి14 : వచ్చే పార్లమెంట్ ఎన్నికలకు కార్యకర్తలు, నాయకులు సిద్ధంగా ఉండాలని బీజేపీ రాష్ట్రక్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు కోరారు. మహబూబాబాద్‌లోని బీజేపీ పార్టీ కార్యాలయంలో బుధవారం పార్లమెంట్ ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 17 పార్లమెంట్ ఎన్నికల కార్యాలయాలను ప్రారంభించినట్లు చెప్పారు. అందులో భాగంగానే మానుకోట జిల్లా పార్టీ కార్యాలయంలో పార్లమెంట్ ఎన్నికల కార్యాలయం ప్రారంభించినట్లు చెప్పారు. ఈనెల 29న 119 అసెంబ్లీ కార్యాలయాలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. రాబో యే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థి గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముస్కు శ్రీనివాస్, వెంకటనారాయణ, జైపాల్ రెడ్డి, యాప సీతయ్య, శశివర్ధన్ రెడ్డి, రాచకొండ కొమురయ్య, సింగారపు సతీష్, భూక్య సంగీత, సిరికొండ బలరాం, ప్రతాప్, బోయినపల్లి లక్ష్మణ్ రావు, సురేందర్, కాంతమ్మ, నాగరాజు, పెంటయ్య, ఇందుభారతి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటుహక్కు నమోదు చేసుకోవాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి) : వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఓటుహక్కు నమోదు చేసుకోవాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టభద్రుల నియోజకవర్గంలో ఫారం-18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 24 ఫిబ్రవరి 2024న ప్రచురించబడే డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్ తయారీకి మాత్రమే దరఖాస్తుల స్వీకరణకు ఈనెల 6వ తేదీని ఆఖరుగా పరిగణించడం జరిగిందన్నారు. నమోదు కోసం ఫారం-18లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియనిలిపివేయబడలేదని తెలియజేస్తూ.. ఇది నిరంతర ప్రక్రియగా పేర్కొంటూ ఎన్‌రోల్ చేయని అర్హత గల ఓటర్లు ఫారం-18లో నమోదు కోసం తమ దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. దరఖాస్తులన్ని 6 ఫిబ్రవరి 2024 తర్వాత ఫిబ్రవరి 14 వరకు పరిగణలోకి తీసుకోవడం జరుగుతుందన్నారు. అభ్యంతరాలు, క్లైయిమ్‌లు మార్చి 14తో ముగుస్తుందన్నారు. ఫైనల్‌రోల్ ఏప్రిల్ 4న ప్రచురించబడుతుందని, అర్హులైన పట్టభద్రులంతా ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవడానికి ఫారం-18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అంతా గప్‌చుప్!

- గుట్టుచప్పుడు కాకుండా నియామకాలు
- ఉద్యోగాల పేరిట నిరుద్యోగులకు గాలం
- ఈఎస్ఐ, పీఎఫ్, వేతనాల్లోనూ కోత

జిల్లాలో ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల ఇష్టారాజ్యం



జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాల భవనం, జిల్లా ఆస్పత్రి

నెహ్రూసెంటర్, ఫిబ్రవరి 14 : ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలకు కొలువుల భర్తీ కాసులు కురిపిస్తున్నాయి. జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖలు, వైద్య, ఆరోగ్యశాఖలో థర్డ్‌పార్టీ లేబర్ పనులకు ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన నియమించాల్సిన ఉద్యోగాల్లో ఏజెన్సీలతో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు నిబంధనలు పాటించడంలేదని రోపణలు వస్తున్నాయి.

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో వైద్యవిద్యను మెరుగు పర్చాలనే ఉద్దేశంతో మెడికల్ కళాశాలను 2022 నవంబర్ 15న వర్చువల్ పద్ధతిలో అప్పటి సీఎం కేసీఆర్ ప్రారంభించారు. ఇందులో అవసరమైన కొన్ని ఉద్యోగాలను కూడా భర్తీ చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. దీంతో జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సెక్యూరిటీ, శానిటేషన్, పేషెంట్ కేర్, అటెండర్‌లు, జూనియర్ అసిస్టెంట్‌లు, ల్యాబ్ అసిస్టెంట్‌లు, స్వీపర్లు ఇతరత్రా పోస్టులను థర్డ్‌పార్టీ లేబర్ పనులకు, ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన కొలువులను నియమించేందుకు ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలకు అనుమతి ఇచ్చింది. దీంతో జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం సన, ప్రణయన్, జీఎంఎస్, సాయిగ్రూప్, రాజ్‌దీప్, సాయినాథ్, ఎర్త్‌తో పాటు మరికొన్ని ఏజెన్సీలకు అప్పగించింది. ఈ విషయంలో ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలు గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉన్న ప్రజాప్రతినిధులు, అధికారులు గోప్యంగా కొలువులను నియమించి, డబ్బులను దండుకున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వైద్య ఆరోగ్యశాఖతో పాటు మైనార్టీ, మునిసిపల్, ఫారెస్టు, పంచాయతీరాజ్‌తో పాటు పలుశాఖల్లో ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలు తమ హవాను నడిపిస్తున్నాయి. కాగా, జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సాయిగ్రూప్ పరిధిలో పని చేస్తున్న సెక్యూరిటీ, శానిటేషన్, పేషెంట్ కేర్ సిబ్బందికి రూ.15,600 వేతనంగా ఇవ్వాల్సి ఉంది. కానీ, ఆ ఏజెన్సీ ఈఎస్ఐ, పీఎఫ్ పేరుతో వేతనాల్లో కోతలు విధిస్తూ రూ.11,093 మాత్రమే ఆ ఉద్యోగులకు చెల్లిస్తోంది. ఈఎస్ఐ, పీఎఫ్ పేరుతో రూ.1000, అదనంగా మరో రూ.3 వేలు మొత్తం రూ.4 వేల పైచిలుకు కోత విధిస్తున్నారు.

వైద్య కళాశాలలో ఇలా..

మహబూబాబాద్ మెడికల్ కళాశాలలో 2022-23 విద్య సంవత్సరానికి 32 పోస్టులను, థర్డ్‌పార్టీ లేబర్ పనులకు మరికొంత మందిని నియామకాలు చేపట్టేందుకు ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలైన సన, ప్రణయన్, జీఎంఎస్‌లకు టెం డర్ అలాట్‌మెంట్ చేశారు. కానీ, కొన్ని పోస్టులకు నోటి ఫికేషన్లు, పత్రిక ప్రకటనలు, టాం..టాంలు చేయకుం డానే వాటిని భర్తీ చేసి, విధుల్లోకి తీసుకున్నారని ఆరోపణలు వెల్లువెత్తాయి. 2023-24 విద్యాసంవత్సరానికి 73 పోస్టులు భర్తీ చేయాలని సన ఏజెన్సీకి ఆదేశాలు రాగా, 24 పోస్టులను వివిధ కారణాల చేత అధికారులు పెండింగ్‌లో పెట్టింది. మిగిలిన 49 పోస్టుల్లో ఐదు పోస్టులను అధికారికంగా భర్తీ చేసి, మిగిలిన పోస్టులను అనధికారికంగా విధుల్లోకి తీసుకున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

నిరుద్యోగులకు గాలం..

మానుకోట జిల్లా కేంద్రంలోని వైద్య, ఆరోగ్యశాఖ, చైల్డ్‌లైన్, స్త్రీశిశు సంక్షేమశాఖ, మునిసిపల్, నర్సింగ్, ఇంజనీరింగ్, వైద్య కళాశాలలు, జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, అటవీశాఖ ఇలా అనేక ప్రభుత్వ డిపార్ట్‌మెంట్‌ల్లో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ప్రాతిపదికన, రోజువారీ వేతనం కింద వివిధ ఏజెన్సీల ద్వారా సిబ్బందిని నియమించడం జరుగుతుంది. కానీ, ఆయా ఉద్యోగాలను రెగ్యులర్ ఉద్యోగాలంటూ దళిత, గిరిజన, మధ్య తరగతి నిరు ద్యోగులకు ఆయా ఏజెన్సీలు ఆశ చూపుతున్నాయి. ఆసక్తి ఉన్న నిరుద్యోగులకు కొలువులు ఇప్పిస్తామని నమ్మ బలికించి, వారి నుంచి డబ్బులు తీసుకుంటున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. అయితే ఆయా కొలువును బట్టి సుమారు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో..

జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాల పరిధిలో ఉన్న ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో గత కొన్నేళ్లగా సాయిగ్రూప్ ఏజెన్సీ సెక్యూరిటీ, శానిటేషన్, పేషెంట్ కేర్, స్వీపర్లను నియమించింది. 149 మంది పని చేయాల్సి ఉండగా, కేవలం 120మందితోనే పనులు చేయిస్తున్నారు. పని చేస్తున్న కార్మికుల వేతనాల నుంచి ఈఎస్ఐ, పీఎఫ్ పేరుతో రూ.1000, అదనంగా మరో రూ.3 వేలను కట్ చేస్తున్నారు. ఎందుకు వేతనాల్లో కోతలు విధిస్తున్నారని ప్రశ్నించిన సిబ్బందిని సైతం విధుల నుంచి తొలగి స్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కార్మికశాఖ నిబంధనల ప్రకారం.. వేతనాల నుంచి కోత విధించవద్దని సూచనలు ఉన్నప్పటికీ ఆ సంస్థ ప్రతినిధులు కార్మికుల వేతనాల్లో కట్ చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఈ సంస్థపై గతేడాది ఉద్యోగాల పేరుతో పైసలు వసూలు చేశారని అభియోగాలు ఉన్నాయి. ఆ ఘటనలో సంస్థకు చెందిన ప్రతినిధులపై చర్యలు తీసుకున్న ఘటనలు కూడా చోటు చేసుకున్నాయి. అయినా ఆ సంస్థలో ఎలాంటి మార్పు రావడం లేదు! జిల్లా ఆస్పత్రిలో వారంలో ఒకసారి వివాదాస్పదంగా మారుతూ.. పేషెంట్‌ల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కాగా, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖలోని ఆర్‌బీఎస్‌కే సైకాలజీ పోస్టుల్లోనూ మెరిట్ ఆధారంగా కాకుండా చేతివాటం చూపించారని సదరు బాధితుడు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

ఆరా తీసిన ఎమ్మెల్యే మురళీనాయక్..

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖలు, వైద్య కళాశాల, జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రులలో ఉన్న ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల పనితీరుపై మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ ఆరా తీశారు. ఇటీవల కాలంలో ఎమ్మెల్యే జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, మెడికల్ కళాశాలను సందర్శించారు. గతేడాది, ఈ ఏడాది మెడికల్ కళాశాలలో ప్రభుత్వ ఆస్పత్రిలో ఎన్నికొలువులు ఉన్నాయి. వాటి నియామ కాలను ఏ ప్రాతిపదికన చేపట్టారు. అనే అంశాలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు నియామకాల్లో అవకతవకలకు పాల్ప డినట్లు తమ దృష్టికి వచ్చిందని, త్వరలోనే సమగ్ర విచారణ జరిపించి ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

ఎలాంటి అవకతవకలు జరగలేదు..



జాటోతు వెంకటేశ్వర్లు, వైద్య కళాశాల ప్రిన్సిపాల్, మహబూబాబాద్

మహబూబాబాద్ వైద్య కళాశాలలో చేపట్టిన కొలువు ల్లో ఎలాంటి అవకతవకలు జరుగలేదు. కలెక్టర్ ఆదేశాను సారం ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు, వారి నిబంధనల ప్రకారం ఉద్యోగులను నియమించడం జరిగింది. థర్డ్ పార్టీ లేబర్ పనులకు, ఔట్ సోర్సింగ్ నియామకాలు పూర్తిగా ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలే నియమిస్తాయని, వాటితో కళాశాల అధ్యాపక బృందానికి ఎలాంటి సంబంధం ఉండదు.

కేయూ బీఈడీ మొదటి సెమిస్టర్ ఫీజు గడువు 21

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 14: కాకతీయ యూనివర్సిటీ బీఈడీ రెగ్యులర్ మొదటి సెమిస్టర్ ఫీజులను ఫిబ్రవరి 21 వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా చెల్లించుకోవాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, డాక్టర్ చాడ రాధికారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.250 అపరాధ రుసుంతో ఫిబ్రవరి 23 వరకు గడువు ఉందని తెలిపారు. రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్ అభ్యర్థులందరూ ఫీజులు చెల్లించుకోవాలని కోరారు. ఇతర వివరాలకు కేయూ వెబ్‌సైట్‌లో చూడాలని కోరారు.

పంపకాలకు వేళాయే!

» ఢిల్లీలోని ఉమ్మడి ఆస్తుల విభజనకు ముందడుగు
» 19.781 ఎకరాలలో.. ఏపీకి 11.356, తెలంగాణకు 8.245 ఎకరాలు
» తెలంగాణ ప్రతిపాదనకు ఏపీ ఓకే



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో రెండు తెలుగు రాష్ట్రాలకు ఉమ్మడిగా ఉన్న ఆస్తుల విభజనలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఉమ్మడి(ఆంధ్రప్రదేశ్, తెలంగాణ)భవన్ విభజనకు మార్గం సుగమమైంది. మొత్తం 19.781 ఎకరాలలో ఉన్న ఉమ్మడి భవన్ ఆస్తులలో ఏపీకి 11,356 ఎకరాలు, తెలంగాణకు 8.245 ఎకరాలు కేటాయించాలని తెలంగాణ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనకు ఏపీ సర్కారు సుముఖత వ్యక్తం చేసింది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వ స్పందనను కేంద్ర హోంశాఖ బుధవారం తెలంగాణ ప్రభుత్వానికి తెలియజేసింది. తెలంగాణ సీఎం ఎ.రేవంత్ రెడ్డి, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి చొరవతో గత నెలలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ భవన్ అధికారులతో కేంద్ర హోంశాఖ కీలక సమావేశం నిర్వహించింది. అనంతరం ఉమ్మడి ఆస్తుల విభజనపై తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. ఏపీ భవన్ కింద ఉన్న గోదావరి బ్లాక్ 4.315 ఎకరాలు, శబరి బ్లాక్‌తో పాటు అంతర్గత రహదారులు, దుకాణాలు(ఆక్రమణకు గురైన ప్రాంతం) ఉన్న 0.512 ఎకరాలు, నర్సింగ్ హాస్టల్ 3.359 ఎకరాలు, పటౌడీ హౌస్‌లో 2.396 ఎకరాలు ఏపీకి ఇచ్చేలా ప్రతిపాదన చేశారు. అదే విధంగా శబరి బ్లాక్ కింద ఉన్న 3 ఎకరాలు, పటౌడీ హౌస్‌లో ఉన్న 5.245 ఎకరాలు తమకు కేటాయించేలా తెలంగాణ ప్రతిపాదన చేసింది. అయితే తమకు ప్రతిపాదించిన అంతర్గత రహదారులు, దుకాణాలు(ఆక్రమణలు) ఉన్న ప్రాంతం(0.512 ఎకరాలు) విలువ దాదాపు రూ.250 కోట్లు అని, ఆ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకోలేకపోతే అందుకు సరిసమానమైన భూమిని శబరి బ్లాక్ లేదా పటౌడీ హౌస్‌లోని భూమి నుంచి కేటాయించాలని ఏపీ షరతు విధించింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వ వివరణ కోరుతూ కేంద్ర హోంశాఖ బుధవారం తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాసింది.

58:42 నిష్పత్తిలో పంపకాలు..

ఢిల్లీలోని ఉమ్మడి ఏపీ భవన్‌కు భూములు, భవనాలు సహా దాదాపు రూ.9,913.505 కోట్ల(దాదాపు పది వేల కోట్లు) విలువైన ఆస్తులు ఉన్నాయి. గోదావరి బ్లాక్, శబరి బ్లాక్, నర్సింగ్ హాస్టల్, పటౌడీ హౌస్ అనే విభాగాల కింద ఉమ్మడి భవన్ ఆస్తులు ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రానికి బయట ఉన్న ఆస్తులను రెండు తెలుగు రాష్ట్రాలు 58:42 నిష్పత్తిలో పంచుకోవాలని రాష్ట్ర పునర్విభజన చట్టంలో పొందుపరిచారు. కాగా, భవన్ పంపకాలలో ఏపీకి 58.32శాతం, తెలంగాణకు 41.68 శాతం ఆస్తులు రానున్నాయి. తెలంగాణ ప్రభుత్వం పటౌడీ హౌస్‌లోని 5.245 ఎకరాల్లో నూతన తెలంగాణభవన్ నిర్మించేందుకు సిద్ధమవుతోంది.



తమ సోదరుడి పాడె మోస్తున్న మల్లు భట్టి విక్రమార్క, రవి

సోదరుడికి కన్నీటి వీడ్కోలు పలికిన భట్టి

» పాడె మోసి నివాళులు

వైరా, ఫిబ్రవరి 14: అనారోగ్యంతో మృతిచెందిన విశ్రాంత ఆయుష్ అదనపు డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ మల్లు వెంకటేశ్వర్లు అంత్యక్రియలు బుధవారం ఆయన స్వగ్రామంలో అశ్రునయనాల మధ్య ముగిశాయి. డాక్టర్ వెంకటేశ్వర్లు సోదరులైన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి డాక్టర్ మల్లు రవి ఆయన పాడె మోసి నివాళులర్పించారు. అంత్యక్రియలకు ముందు డాక్టర్ మల్లు వెంకటేశ్వర్లు భౌతికకాయాన్ని పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు సందర్శించి నివాళులర్పించారు. అనంతరం అంతిమయాత్రతో ఆయన స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురానికి తీసుకువచ్చారు. గంటసేపు గ్రామస్తుల సందర్శనార్థం అక్కడ ఉంచారు. ఆ తర్వాత ఆయన వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహించారు.

రాష్ట్రంలో భారీగా అధికారుల బదిలీలు

» మునిసిపల్ కమిషనర్లు, వ్యవసాయశాఖలో అసిస్టెంట్ డైరెక్టర్లతో పాటు 95 మంది డీఎస్పీలకు స్థానచలనాలు
» జీహెచ్ఎంసీలో కమిషనర్ల బదిలీలు చర్చనీయాంశం

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో.. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అధికారుల బదిలీలు చేపట్టింది. ఈ మేరకు సంబంధిత శాఖలు బుధవారం ఉత్తర్వులు జారీ చేశాయి. రాష్ట్రవ్యాప్తంగా మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో విధులు నిర్వహిస్తున్న 114 మంది కమిషనర్లను బదిలీ చేస్తూ రాష్ట్ర మునిసిపల్‌శాఖ ఉత్తర్వులిచ్చింది. మంగళవారం 40 మంది కమిషనర్లను బదిలీ చేయగా బుధవారం మరో 74 మంది కమిషనర్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులిచ్చింది. ప్రధానంగా జీహెచ్ఎంసీ పరిధిలో దీర్ఘకాలంగా పనిచేస్తున్న మునిసిపల్ కమిషనర్ల బదిలీ చర్చనీయాంశమైంది. గత ప్రభుత్వ పెద్దల అండదండలతో ఏళ్లుగా జీహెచ్ఎంసీ పరిధిలో తిష్టవేసిన పలువురు కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లకు స్థానచలనం కల్పించారు. అలాగే రాష్ట్ర వ్యవసాయశాఖలో పనిచేస్తున్న తొమ్మిది మంది అసిస్టెంట్ డైరెక్టర్లను బదిలీ చేస్తూ రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీచేశారు. మహబూబాబాద్ డీఏవోగా అభిమన్యు, భద్రాద్రి కొత్తగూడెం డీఏవోగా బి.బాబూరావు, సూర్యాపేట డీఏవోగా శ్రీధర్‌రెడ్డిని నియమించారు. పలు డివిజన్లకు ఏడీఏలను కూడా మార్చారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా సివిల్, తదితర విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న 95 మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ రవిగుప్తా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం 110 మంది డీఎస్పీలు బదిలీ కాగా రెండో జాబితాలో మరో 95 మందిని బదిలీ చేశారు.

బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా రేపు సార్వత్రిక సమ్మె

బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలపై ఫిబ్రవరి 16న నిర్వహించనున్న కార్మిక సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఉద్యోగ, కార్మిక, రైతాంగ ప్రజావ్యతిరేక విధానాలను, కార్పొరేట్, మతోన్మాద రాజకీయాలను వ్యతిరేకిస్తూ కేంద్ర ట్రేడ్ యూనియన్ సంఘాలు, రైతుసంఘాల ఐక్యవేదిక సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) దేశవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిచ్చాయని పేర్కొన్నాయి. ఈ మేరకు వామపక్ష పార్టీల తరఫున సీపీఐ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీపీఐఎంఎల్(ప్రజాపంథా) పోటు రంగారావు, సీపీఐఎంఎల్ (న్యూడెమోక్రసీ) చలపతిరావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.



ప్రజాహిత యాత్రలో బండి సంజయ్

'కాళేశ్వరం' బాధ్యులను ఎందుకు అరెస్టు చెయ్యలే?

» ఎంపీ బండి సంజయ్

సిరిసిల్ల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర డ్యామ్ సేఫ్టీ అథారిటీ బృందం కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను సందర్శించి నివేదిక రూపొందించి చర్యలు తీసుకోవాలని కోరినా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ ఆరోపించారు. కాళేశ్వరం బాధ్యులను ఎందుకు అరెస్ట్ చేయడం లేదని ప్రశ్నించారు. అంతేకాక, ఎన్నికల టికెట్ కోసం కన్నకొడుకు పేరునే మార్చేసిన ఘనుడు కేసీఆర్ అని విమర్శించారు. కేటీఆర్ అసలు పేరు కల్వకుంట్ల అజయ్‌రావు అని వెల్లడించారు. సిరిసిల్ల నియోజకవర్గంలోని గంభీరావుపేట, ముస్తాబాద్, తంగళ్లపల్లి మండలాల్లో బండి సంజయ్ బుధవారం ప్రజాహిత యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ తనకు టికెట్ ఇవ్వడం లేదని తెలుసుకున్న కేసీఆర్.. అజయ్‌రావును తీసుకెళ్లి మీ పేరే పెట్టుకున్నానని ఆయనకు చెప్పి టికెట్ తెచ్చుకున్న మోసగాడు కేసీఆర్ అని విమర్శించారు. అబద్ధాలు, మోసాల్లో కేటీఆర్ అయ్యను మించిపోయాడని ఎద్దేవా చేశారు. అయ్య(కేసీఆర్) ఏక్ నంబర్ అయితే కొడుకు(కేటీఆర్) దస్ నంబరని అన్నారు. తెలంగాణకు కేంద్రం పెద్ద ఎత్తున నిధులు ఇస్తోందని, రాజన్న సిరిసిల్ల జిల్లాకు రూ. 1,408 కోట్లు నిధులు ఇచ్చిందని తెలిపారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేస్తే రాముడికి ఓటు వేసినట్లేనని తెలిపారు. తెలంగాణ ప్రజల పక్షాన బీజేపీ కొట్లాడితే కాంగ్రెస్‌కు అధికారం ఇవ్వడం న్యాయమా? అని అడిగారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేసే పరిస్థితి లేదని, ఎన్నికల కోడ్ నెపంతో ఆ పార్టీ నేతలు తప్పించుకునే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు.

రాష్ట్రంలో 2 లక్షల మందికి 'ముఫ్త్ బిజిలీ'!

(మొదటి పేజీ తరువాయి)

యూనిట్ల వినియోగం	సోలార్ ప్లాంట్	వ్యయం	కేంద్రం సబ్సిడీ	వినియోగదారుడు భరించాల్సింది
0-100	1 కిలోవాట్	రూ.60 వేలు	రూ.30 వేలు	రూ.30 వేలు
150	2 కిలోవాట్లు	రూ.1.10 లక్షలు	రూ.60 వేలు	రూ.50 వేలు
300	3 కిలోవాట్	రూ.1.65 లక్షలు	రూ.78 వేలు	రూ. 87 వేలు

తొలిదశలో భాగంగా 34,59,585 మందికి ఉచితంగా విద్యుత్‌ను అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఇదే సమయంలో ప్రధాని మోదీ ప్రకటించిన ముఫ్త్ బిజిలీ యోజన రాష్ట్రంలో సంపూర్ణంగా అమలయితే దాదాపు 2 లక్షల మందికి లబ్ధి చేకూరవచ్చని సంబంధిత అధికారవర్గాలు తెలిపాయి. ఈ మేరకు రాష్ట్రప్రభుత్వంపై గృహజ్యోతి భారం స్వల్పంగా తగ్గే అవకాశం ఉంది. మరోవైపు, ప్రతీ నెల 150 యూనిట్ల దాకా విద్యుత్ వినియోగించేవారికి 1-2 కిలోవాట్ల రూఫ్‌టాప్ సోలార్ యూనిట్ ఏర్పాటు చేసుకోవటానికి అవకాశం ఉంది. దీనికి రూ.1.10 లక్షలు వ్యయం కానుండగా... రూ.60 వేలు సబ్సిడీ లభిస్తుంది. మిగిలిన రూ.50 వేలు సొంతంగా పెట్టుకోవాలి. 150 యూనిట్ల విద్యుత్ వాడకానికి నెలకు రూ.700 దాకా బిల్లు వచ్చే అవకాశం ఉండగా... సోలార్ యూనిట్‌తో రూ.625 మేర ఆదా అవుతుందని, బిల్లు కేవలం రూ.75 మాత్రమే చెల్లించే పరిస్థితి ఉంటుందని తెలుస్తోంది. కేంద్ర పథకం కింద రూఫ్‌టాప్ (ఇంటి పైకప్పు మీద) సోలార్ యూనిట్లు పెట్టుకుంటే... వేసవిలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల దాకా విద్యుత్తు ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంటుంది. ఈ విద్యుత్‌ను సొంతంగా వాడుకోవచ్చు లేదా డిస్కమ్‌లకు విక్రయించుకోవచ్చు. చీకటిపడ్డాక సౌరవిద్యుత్ ఉత్పత్తి ఆగిపోతుంది కాబట్టి ఆ సమయంలో బ్యాటరీలో నిల్వ చేసిన కరెంట్‌ను లేదా డిస్కమ్‌లు సరఫరా చేసే కరెంట్‌ను వాడుకోవాల్సి ఉంటుంది. కాగా, వినియోగదారుల నుంచి కొనుగోలు చేసే విద్యుత్ ధరను కేంద్రం ఖరారు చేయనుంది.

ముఫ్త్ బిజ్లీ యోజన

ముఫ్త్ బిజ్లీ యోజనలో ఒక కిలోవాట్ సోలార్ ప్లాంట్‌కు రూ.30 వేలు, రెండు కిలోవాట్లకు రూ.60 వేలు, మూడు లేదా అంతకన్నా ఎక్కువ కిలోవాట్ సోలార్ ప్లాంట్లకు రూ.78 వేలు సబ్సిడీ లభిస్తుంది.

భారీగా పెరిగిన సబ్సిడీ

సోలార్ రూఫ్‌టాప్ పథకం ప్రారంభించిన కొత్తలో కేంద్రం 3 కిలోవాట్లదాకా 40 శాతం సబ్సిడీ ఇస్తుండేది. అయితే, క్రమేణా దీనిని తగ్గించుకుంటూ వచ్చారు. ప్రస్తుతం ప్రతి కిలోవాట్‌కు రూ.18 వేల చొప్పున 3 కిలోవాట్లకు రూ.54 వేలు సబ్సిడీ ఇస్తున్నారు. 3 కిలోవాట్ల నుంచి 10 కిలోవాట్ల దాకా కిలోవాట్‌కు రూ.9 వేల చొప్పున సబ్సిడీ ఇస్తున్నారు. ఇక అపార్టుమెంట్లు వంటి గ్రూప్ హౌసింగ్‌కు కిలోవాట్‌కు రూ.9 వేల దాకా సబ్సిడీ లభిస్తోంది. అయితే, ప్రస్తుతం ప్రకటించిన ముఫ్త్ బిజిలీ యోజనలో సబ్సిడీని భారీగా పెంచారు. ఈ పథకం కింద సోలార్ ప్లాంట్ ఏర్పాటు కోసం http://pmsuryaghar.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ప్రభుత్వ ఆమోదం లభించిన తర్వాత ఇంటి పైకప్పు మీద సోలార్ యూనిట్ పెట్టుకోవచ్చు. దక్షిణ డిస్కమ్ (ఎస్పీడీసీఎల్-హైదరాబాద్) పరిధిలో 80 మంది, ఉత్తర డిస్కమ్ (ఎన్పీడీసీఎల్-వరంగల్) పరిధిలో 82 మంది సోలార్‌ప్లాంట్ విక్రేతలు ఉన్నారు.

బీఆర్ఎస్‌కు షాక్

కాంగ్రెస్‌లో చేరిన 36 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు

కొత్తగూడెం టౌన్/వైరా/సూర్యాపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్‌కు భారీ షాక్ తగిలింది. కొత్తగూడెం, సూర్యాపేట మునిసిపాలిటీకి చెందిన కౌన్సిలర్లు పార్టీ ఫిరాయించారు. కొత్తగూడెం మునిసిపాలిటీలో బీఆర్ఎస్‌కు చెందిన ఓ కౌన్సిలర్‌తో పాటు పలువురు మహిళా కౌన్సిలర్ల భర్తలు, బంధువులు సుమారు 20 మంది కాంగ్రెస్‌లో చేరారు. వీరంతా బుధవారం ఖమ్మం జిల్లా వైరాలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన నాయకులకు ఏఐసీసీ పరిశీలకుడు రోహిత్‌చౌదరి కాంగ్రెస్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ నెల 19న కొత్తగూడెం చైర్‌పర్సన్ సీతాలక్ష్మిపై అవిశ్వాస తీర్మానం పెడుతున్న నేపథ్యంలో బీఆర్ఎస్‌కు చెందిన నాయకులు కాంగ్రెస్‌లో చేరడం రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, తదితరులు పాల్గొన్నారు. మరోవైపు, ఎన్నో హై డ్రామాల మధ్య సూర్యాపేట మునిసిపల్ చైర్‌పర్సన్ పదవిని బీఆర్ఎస్ నిలబెట్టుకున్నప్పటికీ బీఆర్ఎస్ అసమ్మతి కౌన్సిలర్లు మాత్రం చేజారిపోతున్నారు. మునిసిపల్ చైర్‌పర్సన్ పదవిని ఆశించిన 31వ వార్డు కౌన్సిలర్ కొండపల్లి నిఖిలను, ఆమె భర్త దిలీప్‌రెడ్డిని బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేయడంతో 16 మంది అసమ్మతి కౌన్సిలర్లు బుధవారం మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

ద్వార బంధనాలు.. రక్షాతోరణాలు

• మేడారంలో ఘనంగా మండమెలిగే పండుగ • మహాజాతరలో ముఖ్యఘట్టాన్ని నిర్వహించిన వడ్డెలు

మేడారం, ఫిబ్రవరి 14: మహాజాతరకు ముందు మేడారంలో ప్రధాన ఘట్టమైన మండమెలిగే పండుగను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూజా సామగ్రిని శుద్ధి చేశారు. వనదేవతల గద్దెలను అలికి ముగ్గులు వేశారు. మేడారం గ్రామానికి వనదేవతల వడ్డెలు (పూజారులు) ద్వారబంధనాలు, రక్షా తోరణాలను కట్టారు. గ్రామ దేవతలకు పూజలు చేశారు. మేడారంలోని సమ్మక్క, కన్నెపల్లిలోని సారలమ్మ, ఏటూరునాగారం మండలంలోని గోవిందరాజులు, గంగారం మండలం పూనుగొండ్లలోని పగిడిద్దరాజు పూజా మందిరాల్లో ఆదివాసీ సంప్రదాయ పద్ధతిలో ఈ వేడుకలను నిర్వహించారు.

ప్రధానంగా జాతర జరిగే మేడారంలోని సమ్మక్క, కన్నెపల్లిలోని సారలమ్మ దేవాలయాలను పూజారులు, కుటుంబ సభ్యులు శుద్ధిచేసి అలుకు పూతలు, మామిడి తోరణాలతో అలంకరించారు. డోలు వాయిద్యాలతో గ్రామ, పొలిమేర దేవతల వద్దకు చేరుకొని జలాభిషేకాలు చేసి నూతన వస్త్రాలు సమర్పించారు. పసుపు, కుంకుమలిచ్చి కొబ్బరికాయలు కొట్టి నైవేద్యం సమర్పించారు. ఊరికి ఇరువైపులా ద్వారస్తంభాలు ఏర్పాటు చేసి.. దుష్టశక్తులు పొలిమేర దాటి లోపలికి ప్రవేశించకుండా మామిడాకులు, నల్లకోడి, ఆనపకాయలతో రక్షాతోరణాలు కట్టారు. కల్లు, మద్యం ఆరబోశారు. వనదేవతల గద్దెల వద్ద ప్రధాన పూజారులు రాత్రి జాగరణ చేసి.. 10గంటల తర్వాత దర్శనాలను నిలిపేసి దేవతలకు యాటపోతులను నైవేద్యంగా సమర్పించారు. తెల్లవారుజామున ఇళ్లకు చేరుకున్నారు.

మండమెలిగే పండుగ జరిగిన సరిగ్గా వారంరోజులకు ఈనెల 21న సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు గద్దెకు చేరుకోవడంతో మహాజాతర ప్రారంభమవుతుంది. 22న సమ్మక్క గద్దెకు రావడంతో మహాఘట్టం ఆవిష్కృతమవుతుంది. 23న మొక్కుల సమర్పణ, 24న దేవతలను వనప్రవేశం చేయించడంతో జాతర ముగుస్తుంది. మండమెలిగే పండగ జరిగిన మరుసటిరోజు నుంచి మేడారానికి భక్తుల రాక పెరుగుతుంది. కానీ ఇప్పటికే లక్షల మంది వనదేవతలను దర్శించుకుని ముందస్తు మొక్కులు చెల్లించారు. బుధవారం సుమారు 3లక్షల మంది దేవతలను దర్శించుకున్నట్టు అధికారులు అంచనా వేశారు. ఇక భక్తులకు రవాణా ఇబ్బందులు ఎదురవకుండా ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను నడిపిస్తోంది.



మండమెలిగే పండు సందర్భంగా మేడారం సమ్మక్క - సాలరమ్మ ఆలయ ప్రధాన ద్వారం సమీపంలో రక్షా తోరణాలు కడుతున్న వడ్డెలు



మండమెలిగే పండు సందర్భంగా మేడారం గ్రామంలోని బొడ్రాయి వద్ద పూజలు చేస్తున్నగ్రామస్థులు, వడ్డెలు

తెల్లవారుజామున నుంచే..

మేడారం పూజారులు కుటుంబ సభ్యులు సహా తెల్లవారుజామున లేచి ఇళ్ల వాకిలి శుద్ధి చేసుకున్నారు. పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం గ్రామ దేవతలైన పోచమ్మ, మైసమ్మ గుడిలను శుద్ధి చేశారు. గ్రామంలో బొడ్రాయిని పవిత్ర జలాలతో శుద్ధి చేసి పసుపు కుంకుమలతో అలంకరించారు. పూజలు చేసి దీపదూప నైవేద్యాలను సమర్పించారు. అనంతరం వనదేవతల మందిరాల్లో శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించారు. వనదేవతలకు ప్రత్యేక పూజలు చేసి డోలు వాయిద్యాల నడుమ దీపదూప, పసుపు, కుంకుమ, కొబ్బరికాయ, యాట మొక్కులను సమర్పించారు.

ద్వారతోరణాల ఏర్పాటు

మహాజాతరకు ముందుగా గ్రామానికి తూర్పు, పడమర ప్రవేశ మార్గాల్లో బూరుగు కర్రలకు పసుపు, కుంకుమలు పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మామిడి తోరణాలకు ఉల్లిగడ్డ, కోడిపిల్ల, కత్తి(దిష్టి తగలకుండా) కట్టారు. ధ్వజస్తంభాలను నిలిపి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోకి ఎలాంటి దుష్ట శక్తులు రాకుండా ద్వారబంధం వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఘట్టంతో ఉదయం పూజలు ముగిశాయి. అనంతరం రాత్రి సమయంలో సమ్మక్క ప్రధాన పూజారి (వడ్డె) కృష్ణయ్యతో కలిసి పూజారులు పసుపు, కుంకుమలు తీసుకుని బుర్ర కొమ్ములతో శబ్దాలు చేస్తూ డోలు వాయిద్యాల నడుమ సమ్మక్క గద్దెపైకి చేరుకున్నారు. గద్దెలపై పసుపు, కుంకుమలు పెట్టి విద్యుద్దీపాలను ఆర్పివేసి చిమ్మచీకట్లలో రహస్య పూజలు నిర్వహించారు. గద్దెల ప్రాంగణంలోనే రాత్రంతా చేశారు. సమ్మక్క, సారలమ్మల పూజారులు ఆనవాయితీగా శాక, (కల్లు) ఇచ్చిపుచ్చుకుని సంబరాలు చేసుకున్నారు. గురువారం తెల్లవారుజామున సమ్మక్క పూజారులు పూజా సామగ్రితో తిరిగి గుడికి వెళ్లారు.

కన్నెపల్లిలోని సారలమ్మ గుడివద్ద

మండమెలిగే పండుగను కన్నెపల్లిలోని సారలమ్మ గుడి వద్ద ఘనంగా నిర్వహించారు. మొదట సారలమ్మ ఆలయంతోపాటు అమ్మవారి వస్త్రాలు, పూజా సామగ్రిని శుద్ధి చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పూజారి కాక సారయ్యతోపాటు సారలమ్మ పూజారులు కాక కిరణ్ పలువురు గ్రామానికి ప్రత్యేక పూజలు చేసి ద్వారబంధాలు వేశారు. డోలు వాయిద్యాలు, బుర్రకొమ్ముల శబ్దాలతో సారలమ్మ వద్దకు చేరుకుని విద్యుద్దీపాలు ఆర్పివేసి రహస్య పూజలు నిర్వహించారు. రాత్రంతా గద్దెల ప్రాంగణంలో పూజలు చేసి పూజారులు శాక ఇచ్చిపుచ్చుకుని సంబరాలు జరుపుకున్నారు. వీరు కూడా గురువారం తెల్లవారుజామున కన్నెపల్లి సారలమ్మ గుడికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రాముఖ్యం కలిగిన నాగులమ్మ

మేడారంలోని వనదేవతల గద్దెలకు బయటకు వెళ్లే దారి వద్ద ఉన్న నాగులమ్మ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాజాతరలో ఎవరికి విషపురుగులు కాటువేయకుండా ఉండాలని నాగదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగదేవతకు పసుపు, కుంకుమలు సమర్పించి దీపదూప నైవేద్యాలు సమర్పిస్తారు.. అయితే ఈ కార్యక్రమం తల్లుల గుడి నుంచి గద్దెలకు చేరుకునే సమయానికి ముందుగా చేస్తారు. దీంతో మేడారంలో ఎవరికీ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగవని పూజారుల నమ్మకం.

మంత్రి సీతక్క హాజరు

మండెమెలిగే పండుగలో మంత్రి సీతక్క బుధవారం రాత్రి హాజరయ్యారు. ఆదివాసీ పూజారులతో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆమె వెంట అదనపు కలెక్టర్ శ్రీజ, ఎస్పీ శబరీశ్, ఏటూరునాగారం ఏఎస్పీ సంకీర్త్, డీఎస్పీ రవీందర్ తదితరులు ఉన్నారు.



సారలమ్మ దేవాలయంలో పూజా సామగ్రి శుద్ధి



కన్నెపల్లిలో సారలమ్మ దేవాలయం శుద్ధి అనంతరం వెళ్తున్న వడ్డెలు



పూజారి మునీందర్ నుంచి సమ్మక్క గుడికి పూజా సామగ్రిని తీసుకెళ్తున్న ప్రధాన పూజారి కృష్ణ తదితరులు



అమ్మవార్ల గద్దెల వద్ద భక్తుల సందడి

భక్తజన.. మేడారం

మేడారం, ఫిబ్రవరి 14: వనదేవతలను దర్శించుకోవడానికి మేడారానికి భక్తులు బుధవారం భారీ సంఖ్యలో తరలివచ్చారు. మహాజాతరకు ముందస్తుగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. చల్లగా చూడాలని, తమ కోరికలు తీర్చాలని తల్లులను వేడుకున్నరు. గద్దెల వద్ద ప్రత్యేక పూజలు చేసి పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, కొబ్బరికాయలు, బెల్లం, ముడుపులు సమర్పించారు. వనదేవతలకు జేజేలు, శివసత్తుల పూనకాలు, సన్నాయి వాయిద్యాలతో మేడారం పరిసరాలన్నీ హోరెత్తాయి. బుధవారం సుమారు 50 వేల మంది భక్తులు వనదేవతలను దర్శించుకున్నారని ఈవో రాజేంద్రం తెలిపారు. మేడారం తరలివచ్చిన భక్తులు తాత్కాలికంగా ఏర్పాటైన దుకాణాల్లో కొనుగోళ్లు చేస్తూ సందడి చేశారు.


నేడు ఉత్సవ కమిటీ ప్రమాణ స్వీకారం

హాజరుకానున్న మంత్రులు సురేఖ, సీతక్క

మేడారం, ఫిబ్రవరి 14: మేడారం మహాజాతర సమ్మక్క, సారలమ్మ జాతర ఉత్సవ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవాన్ని గురువారం నిర్వహించనున్నారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క హాజరుకానున్నారు. చైర్మన్‌గా అర్రెం లచ్చుతోపాటు 14 మంది డైరెక్టర్లు ప్రమాణం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆదివాసీ సంఘాల నేతలు అధిక సంఖ్యలో తరలిరావాలని లచ్చు నాయక్ కోరారు.

ఆదివాసీల సంక్షేమానికి కృషి

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క



నాయకపోడ్ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ములుగు, ఫిబ్రవరి 14: ఆదివాసీల సంక్షేమానికి కృషి చేస్తానని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. బుధవారం గట్టమ్మ ఎదురుపిల్ల ఉత్సవం జరిగింది. సాయంత్రం ఆదివాసీ నాయకపోడు సమ్మేళనాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సీతక్క హాజరయ్యారు. గట్టమ్మను దర్శించుకున్న అనంతరం మాట్లాడుతూ.. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబాటుకు గురైన ఆదివాసీలు చైతన్యవంతులు కావాలన్నారు. ఆదివాసీల ఇలవేల్పులకు గుర్తింపు వచ్చేలా సహకారం అందిస్తాననన్నారు. మేడారం మహాజాతర తర్వాత ప్రణాళిక రూపొందించి ఆలయాల అభివృద్ధికి చర్యలు చేపడతామని అన్నారు. ఆదివాసీలు ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్, కూన దయానందసామి, కొత్త సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

డోర్నకల్, ఫిబ్రవరి 14 : మండలంలోని లకావత్‌తండాకు చెందిన ఓ వ్యక్తి విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. లకావత్‌తండాకు చెందిన లకావత్ సోమ్లా (50) ఖమ్మం రూరల్ మండలం మంగళగూడెంకు చెందిన ఉపేందర్ అనేరైతు భూమిని కౌలుకు తీసుకున్నారు. అందులో కొంతభాగం ఫామాయిల్ తోట ఉండడంతో పశువుల నుంచి రక్షణ కొరకు తోటచుట్టూ సదరు రైతు ఇనుపతీగలతో ఫెన్సింగ్ చేశాడు. ఫెన్సింగ్ తీగకు విద్యుత్ మోటారు వైర్లు ఆనుకుని ఉండడంతో వాటిని తాకిన సోమ్లా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలిసిన తండవాసులు ఘటన స్థలానికి చేరుకుని సోమ్లకుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన చేపట్టారు. రూరల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు.

ఆటోను ఢీకొట్టిన కారు : ఒకరికి తీవ్ర గాయాలు

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 14 : జిల్లా కేంద్రంలోని బతుకమ్మ ఘాట్ సమీపంలో పెనుగొండ నుంచి మహబూబాబాద్‌కు వస్తున్న ఆటోను వెనుక నుంచి కారు ఢీ కొట్టిన ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలైనట్లు టౌన్ ఎస్సై అరుణ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం శంభునిగూడెంకు చెందిన గుంజ శ్రీలత కేసముద్రం మండలం పెనుగొండలో బంధువుల ఇంట్లో శుభకార్యానికి కుటుంబసభ్యులతో కలిసి ఆటోలో వచ్చారు. తిరుగు ప్రయాణంలో వరంగల్‌జిల్లా సంగెం మండలం ఏలూగూర్‌కు చెందిన బానోత్ సతీష్ అనేకార్ డ్రైవర్ మానుకోట జిల్లా కేంద్రం సమీపంలోని బతుకమ్మ ఘాట్ వద్దకు రాగానే ముందుగా వెళ్తున్న ఆటోను ఢీకొట్టడంతో ఆటోలో ఉన్నబావ కుమారుడు మనోజ్ కిందపడ్డాడు. వెంటనే అతడిపై నుంచి కారుపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు మనోజ్‌ను చికిత్స నిమిత్తం 108 ద్వారా జిల్లా ఆస్పత్రికి తరలించారు. శ్రీలత ఇచ్చిన ఫిర్యాదు మేరకుప్రమాదానికి కారుకుడైన కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అరుణ తెలిపారు.

మృతదేహాలకు అంత్యక్రియలు

గూడూరు, ఫిబ్రవరి 14 : మండల కేంద్రంలో మంత్రాల నెపంతో హత్యగావించబడిన ఆలకుంట్ల సమ్మక్క, ఆమె కుమారుడు సమ్మయ్యల అంత్యక్రియలను స్వగ్రామమైన బొల్లెపల్లిలో బుధవారం నిర్వహించారు. మృతదేహాల అంతిమయాత్ర నిర్వహించారు. ఈదులగండి చెరువు వద్ద అంత్యక్రియలు నిర్వహించారు. ఆలకుంట్ల సమ్మక్క మృతదేహానికి భర్త కొమురయ్య, సమ్మయ్య మృతదేహానికి అతని కుమారుడు హేమంత్ తలకొరివి పెట్టారు. ఒకే కుటుంబంలో ఇద్దరు హత్యకు గురికావడంతో బొల్లెపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి. అంతిమయాత్ర సమయంలో ఎలాంటి గొడవలు చోటు చేసుకోకుండా పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

జంట హత్య కేసులో నిందితుడు అరెస్టు


నిందితుడు కుమారస్వామిని అరెస్టు చూపుతున్న సీఐ ఫణిదర్, ఎస్సై రాణాప్రతాప్

గూడూరు, ఫిబ్రవరి 14 : మండల కేంద్రంలో మంత్రాల నెపంతో ఇద్దరి రాడ్డుతో కొట్టి హత్యచేసిన నిందితుడు శివరాత్రి కుమారస్వామిని బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు గూడూరు సీఐ ఫణిదర్ తెలిపారు. బొల్లెపల్లి గ్రామానికి చెందిన ఆలకుంట్ల సమ్మక్క, ఆమె కుమారుడు సమ్మయ్యను మంత్రాల నెపంతో రాడ్డుతో కొట్టి హత్య చేసిన విషయం విదితమే. తాజాగా నిందితుడికి వైద్య పరీక్షలు నిర్వహించి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఈకార్యక్రమంలో ఎస్సై రాణాప్రతాప్ పాల్గొన్నారు.

50 క్వింటాళ్ల నల్ల బెల్లం పట్టివేత

- డీసీఎం వాహనం సీజ్ • ముగ్గురిపై కేసు నమోదు

నర్సింహులపేట, ఫిబ్రవరి14 : ప్రభుత్వ నిషేధిత 50 క్వింటాళ్ల నల్లబెల్లం, రెండు క్వింటాళ్ల పటికను స్వాధీనం చేసుకుని, రవాణాకు ఉపయోగించిన డీసీఎం వ్యానును సీజ్‌చేసి, ముగ్గురుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జి.సతీష్ బుధవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. మండలంలోని జయపురం, రామన్నగూడెం క్రాస్ రోడ్డు వద్ద ఉదయం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా డీసీఎం వాహ నం అటువైపుగా వచ్చి పోలీసులను చూసి వెనక్కి వెళ్తున్న క్రమంలో వెంటనే అప్రమత్తమై, డీసీఎంను తనిఖీ చేశారు. అందులో 100 బస్తాల్లో నల్లబెల్లం, 200కిలోల పటిక ఉన్నట్లు గుర్తించారు. వెంటనే వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీజ్ చేశారు. అక్రమ దందా నిర్వహిస్తున్న మండలంలోని గోల్‌బోడ్కా తండాకు చెందిన కోటేష్, డీసీఎం డ్రైవర్ కడారి యాదగిరి, మధు తండాకు చెందిన భూక్య చంద్రులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కొంతకాలంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు నుంచి మహబూబాబాద్ జిల్లాకు బెల్లం తరలించి అక్రమ వ్యాపారం నిర్వహిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సీత్లాతండాలో 10 క్వింటాళ్లు..

డోర్నకల్ : డోర్నకల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అందనాలపాడు శివారు సీత్లాతండాలో 10 క్వింటాళ్ల నల్లబెల్లంను స్వాధీనం చేసుకున్నట్లు డోర్నకల్ సీఐ ఉపేందర్ రావు తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం. సీత్లాతండాకు చెందిన ప్రేమ్‌కుమార్ అనేవ్యక్తి బెల్లాన్ని రహస్య ప్రదేశంలో నిల్వ ఉంచినట్లు వచ్చిన సమాచారం మేరకు ఎస్సై సంతోష్‌కుమార్ సిబ్బందితో వెళ్లి బెల్లంను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. బెల్లం నిల్వ చేసిన ప్రేమ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

వైభవంగా మండెమెలిగే పండుగ

- పూనుగొండ్ల పగిడిద్దరాజు ఆలయంలో పూజలు


పగిడిద్దరాజు ఆలయంలో ముగ్గు వేస్తున్న పెనక వంశస్తులు

గంగారం, ఫిబ్రవరి 14 : మండలంలోని పూనుగొండ్ల గ్రామంలో కొలువైన పగిడిద్దరాజు ఆలయంలో బుధవారం మాఘశుద్ధ పంచమిని పురస్కరించుకుని, మండెమెలిగే పండుగను ఘనంగా నిర్వహించారు. తొలుత పెనక వంశానికి చెందిన ముత్తైదువవైన ఆడబిడ్డలు తలపతి ఇంటి నుంచి పసుపు కొట్టి.. ఆ పసుపు, కుంకుమలు తీసుకుని మేలతాళాలతో బైలెల్లి ఆయలం ప్రాంగణాన్ని మండుమెలిగే (శుద్ధి) కార్యక్రమం చేశారు. అనంతరం గర్భగుడిలో పగిడిద్దరాజు పూజా సామగ్రిని ఆవు పాలతో, గోపంచకంతో శుద్ధి చేశారు. ఆలయంలో బియ్యం పిండితో ముగ్గులు వేశారు. అనంతరం ఆలయం తలపతులు, వడ్డెలు, పూజారులు కలిసి బంగారం, (బెల్లం) ఆవుపాలతో తయారు చేసిన పాయాసంను రహస్య పూజలు చేసి, స్వామివారికి నైవేద్యం పెట్టారు. మేడారం సమ్మక్క, సార్లమ్మకు అవసరమైన చీరసారె పసుపు కుంకుమలను ఆలయంలో ఉంచి పూజించారు. స్వామివారి సామగ్రిని శుద్ధి చేసిన తర్వాత అమ్మవారికి అవసరమైన సామగ్రిని తీసుకుని, నలుగురుపూజారులు బుధవారం మేడారంలో సమ్మక్క ఆలయానికి బయలు దేరి, అమ్మవారికి సమర్పిస్తామని పూజారి లక్ష్మీనర్సు తెలిపారు. ఈరోజు నుంచి జాతర పనులను ప్రారంభిస్తున్నట్లు అర్చకుడు పెనక పురుషోత్తం తెలిపారు. ఈ కార్యక్రమంలో పెనక సురేందర్, రాజేశ్వర్, వెంకన్న, లక్ష్మీనర్సు, రామస్వామి పాల్గొన్నారు.

చింతలగట్టులో..


వట్టేవాగు సమ్మక్క-సారలమ్మ జాతరలో సమ్మక్క గద్దె వద్ద పూజలు నిర్వహిస్తున్న పూజారులు, భక్తులు


సమ్మక్క-సారలమ్మ జాతరలో ఆలయం చుట్టు పొలి చల్లుతున్న పూజారులు

గూడూరు : మచ్చర్ల-దామెరవంచ జగన్నాయులగూడెం సరిహద్దు అటవీప్రాంతంలో చింతలగట్టు వట్టేవాగు సమ్మక్క-సారలమ్మల మహాజాతరకు సర్వం సిద్ధమైంది. చింతలగట్టు వట్టేవాగు సమ్మక్క-సారలమ్మ జాతరలో వనదేవతలను గద్దెలను శుద్ధిచేసి మండమెలిగే పండుగను ఘనంగా నిర్వహించారు. అటవీ నుంచి తెచ్చిన పూలతో సమ్మక్క-సారలమ్మ గద్దెలను అలంకరించారు. అమ్మవార్లకు పూజా సామగ్రి, వస్త్రాలు, పసుపు, కుంకుమ, వడిబియ్యంను పూజారులు సమర్పించారు. మహిళలు పుట్టమట్టితో దేవాలయంలో ఉన్న శక్తిపీఠానికి పసుపు, కుంకుమలు పెట్టి పూజలు నిర్వహించారు. అడవి పొలిమేర్లలో నీళ్ల కుండలను ఆరగించారు. దుష్టశక్తులు రాకుండా ధ్వజస్తంభం ఏర్పాటు చేసి కోడిపిల్లను కట్టారు. ప్రధాన పూజారి దారం సిద్ధు అమ్మవార్లకు వస్త్రాలతో అలంకరించారు. గుడికి మామిడి ఆకుల తోరణాలు కట్టించారు. పూజారులు గద్దెలపైకి చేరుకుని పూజలు నిర్వహించి మండ మెలిగే పండగను ఘనంగా నిర్వహించారు. మండమెలిగే మొదలు జాతర పూర్తయ్యే వరకు పూజారులు ఉపవాసాలు ఉంటారు. మండ మెలిగే కార్యక్రమం పూజారుల కమిటీ అధ్యక్షుడు దారం సిద్ధు, జాతర కమిటీ అధ్యక్షులు పెనక నాగయ్య, జాతర నిర్వాహకులు, పూజారులు సహదేవులు, భద్రయ్య, సనుప వీరస్వామి, లక్ష్మయ్య, నరేష్, సుధాకర్, రమేష్, జనార్దన్, కోటయ్య, వజ్జయ్య, సాంబరాజు, అశోక్, భద్రమ్మ, బుచ్చమ్మ, రాము, రమేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ గుగులోతు సుచిత్ర బాలునాయక్, తహసీల్దార్.. మాజీ సర్పంచులు ముక్కా లక్ష్మణ్‌రావు, సుధాకర్‌రావు, పెనక రాంమ్మూర్తి పాల్గొన్నారు.

మానుకోట డీఆర్‌డీఏ పీడీగా పురుషోత్తం

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 14 : మానుకోట డీఆర్‌డీఏ పీడీగా డి.పురుషోత్తం బుధవారం బాధ్యతలను చేపట్టారు. 2007లో ఖమ్మం జిల్లా ముల్కనూరు ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టి కుక్కునూరు, మణుగూరు, నేలకొండపల్లి, భద్రాచలం, మరిపెడ, ఖమ్మం డిప్యూటీ సీఈవోగా, భద్రాద్రి కొత్తగూడెం డిప్యూటీ సీఈవోగా, భూపాలపల్లి జయశంకర్ డీఆర్‌డీఏ పీడీగా విధులు నిర్వహించి ఇటీవల బదిలీలో భాగంగా మహబూబాబాద్ జిల్లా డీఆర్‌డీఏ పీడీగా బదిలీపై వచ్చారు. అనంతరం కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

డీఆర్‌డీఏ అదనపు పీడీగా సురేష్..

మహబూబాబాద్ అడిషనల్ డీఆర్‌డీఏ పీడీగా సురేష్ బాధ్యతలను చేపట్టారు. 2003లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో డీపీఎంగా విధుల్లో చేరి 2011లో కృష్ణాజిల్లాలో ప్రాజెక్టు మేనేజర్‌గా, 2014లో ఖమ్మం జిల్లా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రాజెక్టు మేనేజర్‌గా విధులు నిర్వహించారు. 2018లో జయశంకర్ భూపాలపల్లి అడిషనల్ డీఆర్‌డీఏ పీడీగా పనిచేశారు. ఇటీవల బదిలీల్లో మహబూబాబాద్ జిల్లా అడిషనల్ డీఆర్‌డీఏ పీడీగా బదిలీపై వచ్చారు. బాధ్యతలను చేపట్టిన అనంతరం కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

సేవాలాల్ గుడివద్ద ఏర్పాట్లను పరిశీలించిన

అదనపు కలెక్టర్, గిరిజన సంక్షేమశాఖ డీడీ

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 14 : జిల్లా కేంద్రం అనంతాద్రి శివార్లలో శ్రీసంతు సేవాలాల్ మహరాజ్ గుడి ప్రాంతాన్ని బుధవారం అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో, గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎర్రయ్య సందర్శించారు. ఈనెల 15 సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాల నేపథ్యంలో గుడి వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. మునిసిపల్ వార్డు కౌన్సిలర్లు భూక్య శ్రీను, హరిసింగ్, గిరిజన సంఘాల ప్రతినిధులు బోడ రవినాయక్, బోడ రమేష్, హరిలాల్, ప్రసాద్ పాల్గొన్నారు.

గుడితండాలో వివాహిత అదృశ్యం

చెన్నారావుపేట, ఫిబ్రవరి 14 : వివాహిత అదృశ్యమైన సంఘటన పాపయ్యపేటలో బుధవారం వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం. గుడి తండాకు చెందిన భూక్య హనుమా కూతురు అశ్వినిని గుండెగకు చెందిన ఓ వ్యక్తికితో నాలుగేళ్ల క్రితం పెళ్లి జరిపించారు. వీరికి రెండేళ్ల కూతురు ఉంది. కాగా, మంగళవారం ఉదయం పుట్టింటికి వచ్చింది. ఇంట్లో ఉన్న ఆమె తెల్లవారేసరికి కనిపించకుండా పోయింది. చుట్టుపక్కల, బంధువుల ఇళ్లల్లో వెదికనా ఆచూకి లభ్యం కాలేదు. తండ్రి హనుమా ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై లక్ష్మణమూర్తి తెలిపారు.

ఏబీఎఫ్ ఉద్యోగానికి దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 14 : నీతిఅయోగ్ యొక్క అస్పిరేషనల్ బ్లాక్ ఫెల్లో (ఏబీఎఫ్) ఒక ఏడాది కాలపరిమితితో కూడిన ఉద్యోగం ఒప్పందపద్ధతిపై పని చేయడానికి అర్హత కలిగిన యువత దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ బుధవారం ఒక ప్రక టనలో తెలిపారు. ఈనెల 21న సాయంత్రం 5.30 గంటల్లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వివరాలకుhttp://mahabubabad.telangana.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు

రేపు జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 14 : హైదరాబాద్‌లోని మెడ్‌ప్లస్ ఫార్మసీలో ఖాళీగాఉన్న 50 పోస్టులు ఫార్మసిస్ట్, జూనియర్ అసిస్టెంట్, ఆడిట్ అసిస్టెంట్‌లకు గాను ఎం.ఫార్మసీ, బీ.ఫార్మసీ, డీ.ఫార్మసీ, ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ విద్యార్హతలున్న జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకుల ఉపాధి అవకాశాల కోసం ఈనెల 16న ఉదయం 10.30 గంటలకు జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు ఉపాధి అధికారి రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 30 ఏళ్లలోపు వారు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జాబ్‌మేళాకు హాజరయ్యే వారు తమ విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో రావాలని సూచించారు.

శ్రమజీవులంతా సమ్మెలో పాల్గొనాలి

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 14 : కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న ఉద్యోగ, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను ఎండగడుతూ ఈనెల 16న జరుపతలపెట్టిన సార్వత్రిక సమ్మెలో శ్రమజీవులంతా పాల్గొని జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు పశ్య పద్మ పిలుపునిచ్చారు. మహబూబాబాద్ వీరభవన్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా నిర్మాణ బాధ్యుడు నల్లు సుధాకర్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నెల్లూరు నాగేశ్వర్‌రావు, మేక వీరన్న పాల్గొన్నారు.

'ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి'

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 14 : వాహనదారులు ట్రాఫిక్ నియమనిబంధనలను పాటించాలని మహబూబాబాద్ డీఎస్పీ తీర్థాల సత్యనారాయణ అన్నారు. ఎస్పీ సంగ్రామ్‌సింగ్ జీపాటిల్ ఆదేశాల మేరకు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో రోడ్డుభద్రత వారోత్సవాల ముగింపును పురస్కరించుకుని బుధవారం ర్యాలీ, మానవహారం నిర్వహించారు. అనంతరం హెల్మెట్‌లేకుండా ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనదారులకు చాక్లెట్, గులాబీ పూలుఇస్తూ.. హెల్మెట్ ధరించడం వల్ల కలిగే లాభాలపై అవగాహన కల్పించారు. సీఐలు పెండ్యాల దేవేందర్, శరవయ్య, ఎస్సైలు రామారావు, దీపిక, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యార్థుల ప్రదర్శన

కేసముద్రం, ఫిబ్రవరి 14 : అమీనాపురం జీపీ ఆవరణలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చర్ యూనివర్సిటీకి చెందిన వ్యవసాయ విద్యార్థులు ఆర్ఏడబ్ల్యూఈపీ ప్రోగ్రాంలో భాగంగా బుధవారం ప్రదర్శన నిర్వహించారు.విద్యార్థులు సాయికిరణ్, సాయి అరవింద్, వేణు, శ్రీనివాస్‌రెడ్డి భాగస్వామ్య గ్రామీణతులనం(పీఆర్ఏ)కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పంటల సాగు గణాంకాలను నీటి వనరులను గ్రామానికి సంబంధించిన విషయాలతో ప్రదర్శన నిర్వహించారు. యాకూబ్‌రెడ్డి, శ్రీనివాస్, యార రమేష్, సామ సుధాకర్, పోతుల రవి పాల్గొన్నారు.

ముగిసిన నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠాపన

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 14 : జిల్లా కేంద్రంలోని కొత్తబజారులోని శ్రీనాగేంద్ర స్వామి దేవాలయంలో ఈ నెల 12 ప్రారంభమైన శ్రీలలితాదేవి శివలింగనంది, మహాగణపతి, సుబ్రమణ్యస్వామి నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారంతో ముగిశాయి. అర్చకులు వంకోజు జలేంద్రాచారి వేద మంత్రోచ్చరణల నడుమ ఉదయం 5 గంటలకు సుప్రభాతసేవ, దేవతా మూర్తిపూజలు, యథావిధి పూజలు, యంత్ర పూజలు, హోమం తదితర పూజలు నిర్వహించి విగ్రహప్రతిష్ఠ పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మానుకోట ఎంపీ మాలోతు కవిత, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, స్థానిక మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, కేసముద్రం మార్కెట్ మాజీ చైర్మన్ పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్ ప్రసన్నారాణి, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి, శ్రీనాగేంద్ర స్వామి దేవాలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు డేగల సత్యనారాయణ, నీలం శ్రీనివాస్, వార్డు కౌన్సిలర్ నీరజారెడ్డిదర్మన్న హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకలో సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, గుడిబోయిన గోపి మాధవ్, విద్యాసాగర్, బట్టు అంజయ్య, నరేందర్, ప్రసాద్, లక్ష్మీనారాయణ. వెంకటరామనర్సయ్య, వెంకటరమణ, చారి, సింగం విష్ణు, శ్యాంప్రసాద్, రమేష్, గోపాల్, అరవింద్, కార్తీక్, కౌశిక్, పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న పాల్గొన్నారు.

సునీల్‌రెడ్డికి పలువురి పరామర్శ

కురవి, ఫిబ్రవరి 14 : పితృవియోగానికి గురైన రాష్ట్రప్రభుత్వ ధరణి కమిటీ సలహాదారు, నల్సార్ యూనివర్శిటీ ప్రొఫెసర్ మేక సునీల్ రెడ్డిని పలువురు ప్రముఖులు బుధవారం పరామర్శించారు. ఎంపీ కవిత సునీల్‌రెడ్డితో పాటు సందీప్‌రెడ్డి, మేక సురేష్‌రెడ్డిలను ఓదార్చారు.ఎంపీ వెంట పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, బజ్జూరి పిచ్చిరెడ్డి ఉన్నారు. మాజీ కేంద్ర మంత్రి బలరాంనాయక్ సునీల్‌రెడ్డిని పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు అంబటి వీరభద్రం, డొంగల జనార్ధన్‌రెడ్డి ఉన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ సునీల్‌రెడ్డిని పరామర్శించారు. ఆమెవెంట సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథి, నల్లు సుధాకర్ రెడ్డి నెల్లూరి నాగేశ్వర్‌రావు ఉన్నారు.

రోడ్డు మరమ్మతు పనులను పూర్తి చేయాలి

- మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి14 : వాహనదారులు, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా రోడ్డు మరమ్మత్తు పనులు త్వరగా పూర్తి చేయాలని మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్ పట్టణంలోని బందంకుంట చెరువు వద్ద కొనసాగుతున్న రోడ్డు మరమ్మత్తు పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ వేగవంతంగా పనులు పూర్తిచేసి వాహనదారులు ఇబ్బందులను తొలగించాలన్నారు. ఏఈ సురేష్, చిదిరాల శరత్ పాల్గొన్నారు.

'దేశవ్యాప్త సమ్మెను సక్సెస్ చేయండి'

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 14 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న మతతత్వ విధానాలను నిరసిస్తూ ఈనెల 16న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ సడక్‌బంద్‌ను జయప్రదం చేయాలని అఖిలపక్ష రాజకీయపార్టీల నేతలు ఘనపురపు అంజయ్య, సాదుల శ్రీనివాస్, మండల వెంకన్న, పెరుగుకుమార్, రాజ్‌కుమార్, చిన్నచంద్రన్న, ఐలయ్య, దేవేందర్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని బట్టు అంజయ్య భవనంలో బుధవారం అఖిల పక్ష రాజకీయ పార్టీల రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో రేషపల్లి నవీన్, ఆకుల రాజు, కుంట ఉపేందర్, కొత్తపల్లి రవి, గునిగంటి రాజన్న, చింతకుంట్ల వెంకన్న, వెలుగు శ్రావణ్, లింగ్యానాయక్, జగ్గన్న, పాపయ్య , అశోక్, బాబు పాల్గొన్నారు.

అట్టహాసంగా శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ


రామాలయంలో ఏర్పాటు చేస్తున్న ధ్వజ స్తంభం

బయ్యారం, ఫిబ్రవరి 14 : సత్యనారాయణపురంలో శ్రీరాముని విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవోపేతంగా కొనసాగింది. గ్రామంలో నూతనంగా రామాలయం పునర్‌నిర్మించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా మూడు రోజులపాటు విగ్రహాలకు ప్రాణప్రతిష్ఠ పూజలు, హోమాలు నిర్వహించగా.. బుధవారం ఆలయంలో విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన చేశారు. భద్రాచలం శ్రీ కోదండ రామచంద్రస్వామి ఆలయానికి చెందిన ముఖ్యపూజారి రామభద్రాచార్యులు నేతృత్వంలో వేద పండితులు, పూజాలు ఆలయంలో శాస్త్రోత్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరామ నామ స్మరణతో ఆలయ పరిసర ప్రాంతాలు మార్మోగాయి.

తొర్రూరు డీఎస్పీ వెంకటేశ్వరబాబు బదిలీ

తొర్రూరు, ఫిబ్రవరి 14 : తొర్రూరు డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న జి.వెంకటేశ్వరబాబు బుధవారం ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా డీజీపీ కార్యాలయాల్లో రిపోర్టు చేయవల్సిందిగా ఆదేశాలు జారీ అయ్యాయి. జగిత్యాల జిల్లా డీసీఆర్బీలో విధులు నిర్వహిస్తున్న డీఎస్పీ వి.సురేష్ బదిలీపై తొర్రూరు డీఎస్పీగా బాధ్యతలు చేపట్టనున్నారు.


నాలుగు రోజుల పాటు రైల్వేగేటు మూసివేత

గార్ల, ఫిబ్రవరి 14 : గార్ల-డోర్నకల్ సరిహద్దు ప్రాంతంలోగల రైల్వే గేటును మూడో రైల్వేలైను మరమ్మతుల కారణంగా నాలుగు రోజులపాటు మూసి వేస్తున్నట్లు రైల్వేసెంక్షన్ ఇంజనీర్ శివకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గార్ల-డోర్నకల్ మధ్య ప్రయాణించే ప్రయాణికులకు తెలిసే విధంగా గేటువద్ద హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ప్రయాణికులు గమనించి, సహకరించాలని కోరారు.

28 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

నెల్లికుదురు, ఫిబ్రవరి 14 :అక్రమంగా తరలిస్తున్న 28 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు. సిద్దిపేట జిల్లా నిరుదోడి మండలం, లక్ష్మీనగర్‌కు చెందిన గుండెనేని బాలయ్య కేసముద్రం మండలం నుంచి సిద్దిపేటకు వాహనంలో 28 క్వింటాళ్ల బియ్యం తరలిస్తున్న క్రమంలో నెల్లికుదురు క్రాస్‌రోడ్డు వద్ద పట్టుకొని సీజ్ చేసి బాలయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు.

వైభవంగా బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన


పెగడపల్లిలో విగ్రహాలను తీసుకువస్తున్న భక్తులు

కొత్తగూడ, ఫిబ్రవరి 14 : పెగడపల్లిలో బొడ్రాయి పునః ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని గ్రామస్తులు వైభవంగా నిర్వహించుకున్నారు. వేదపండితులు పూజలు, హోమాలు నిర్వహించారు. బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన చేశారు. గ్రామ దేవత విగ్రహాలను గుళ్లలో ప్రతిష్ఠించారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతవరణం నెలకొంది. గ్రామపెద్దలు పెనుక సమ్మయ్య నాలి సాంబయ్య డిల్లీ మోహన్‌రావు, బొల్లు వెంకన్న, కత్తుల గట్టయ్య బొల్లు రమేష్, బొల్లు రవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

'కొడుకును పొట్టన పెట్టుకున్నారు..!'

మరిపెడ, ఫిబ్రవరి 14 : ఒక్కగానొక్క కొడుకును పొట్టన పెట్టుకున్నారు. సరియైన సమయంలో పోలీసులు స్పందించి ఉంటే ఈ అఘాత్యం జరిగి ఉండేది కాదేమోనని కొత్తతండాకు చెందిన మృతుడి కుటుంబ సభ్యులు విలేకరుల ఎదుట కన్నీటి పర్యాంతం చెందారు. మృతుడి తండ్రి నర్సింహా, సోదరి భూక్యా అచ్చమ్మ, లూనావత్ జ్యోతి, ఆ తండావాసులు బుధవారం స్థానిక విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈనెల 8న కొత్తతండాకు చెందిన ఇద్దరు వ్యక్తులు అజ్మీరా శ్రీనుపై దాడి చేసింద్రని, వెంటనే పోలీసులను ఆశ్రయిస్తే స్పందించలేదన్నారు. దాడిచేసిన వారినే వెనుకేసుకొచ్చారని, దాంతో అయన అవమానంగా భావించి ఈనెల 9న పురుగుల మందుతాగగా చికిత్స పొందుతూ 11వ తేదీన వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో మృతి చెందారన్నారు. దాడి చేసిన వారిని కఠినం గా శిక్షించాలని, పోలీసుల ఉదాసీనతపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తగు విచారణ జరిపి శాఖపరమైన చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు. మృతుడికి ఇద్దరు కుమారులు, భార్య ఉందన్నారు. ఈ సమావేశంలో తండాకు చెందిన అజ్మీరా వీరన్న, రమేష్, బన్నీ, హస్సేన్, కిషన్, రూప్లా, శ్రీను పాల్గొన్నారు. కాగా, ఈ విషయంపై పోలీసులను వివరణ కోరగా నిందితులపై ఐపీసీ 306 సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్టేషన్‌రైటర్ ఉమాకర్ తెలిపారు.

యువకుడి దారుణ హత్య

కరీమాబాద్, ఫిబ్రవరి 14 : భార్యాభర్తల మధ్య ఏర్పడిన కలహాలు ఆ యువకుడి హత్యకు దారితీశాయి. భార్య తనను విడిచివెళ్లిపోవడానికి అత్తింటివారే కారణమని కక్ష పెంచుకున్న అతడు.. తరచూ భార్యతోపాటు తమపై సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెడుతుండటాన్ని జీర్ణించుకోలేకపోయిన అత్తింటివారు అతడిని దారుణంగా హతమార్చారు. కంట్లో కారంచల్లి.. బండరాయితో మోది.. మెడకు తాడును బిగించి హత్యచేశారు. ఈ ఘటన మంగళవారం అర్ధరాత్రి వరంగల్‌లోని రంగశాయిపేటలో జరగ్గా బుధవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్‌లోని రంగంపేట ప్రాంతానికి చెందిన బ్యాంకు ఉద్యోగి దుట్ట వెంకటరమణ-భాగ్య దంపతులకు ముగ్గురు కుమారులు. రెండో కుమారుడు దుట్ట శ్రీనివాస్ (32)కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతడికి రంగశాయిపేట ప్రాంతానికి చెందిన హమాలీ పనిచేసే బజ్జూరి రమేష్-విజయ దంపతుల కూతురు రమ్యతో 2015లో వివాహమైంది. పెళ్లయిన ఏడాదితే భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో పలుమార్లు ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకున్నారు. ఈ క్రమంలో ఎనిమిదేళ్లుగా శ్రీనివాస్, రమ్యలు విడివిడిగా ఉంటున్నారు. శ్రీనివాస్, రమ్య దంపతులకు సంతానం కలగలేదు. అయితే భార్య తనను కాదని వేరుగా ఉండటాన్ని అత్తమామలు, బావమరిది సమర్థిస్తున్నారని శ్రీనివాస్ అత్తింటివారిపై కక్ష పెంచుకున్నాడు. అప్పటి నుంచి భార్య రమ్య, అత్త, మామ, బావమరిదిపై సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టడం ప్రారంభించాడు. సోషల్ మీడియా పోస్టుల ద్వారా వేధింపులు అధికమవడంతో కొంతకాలంగా రమ్యను ఆమె తల్లిదండ్రులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంచారు. అయితే రంగశాయిపేటలో ప్రస్తుతం జరుగుతున్న బొడ్రాయి ప్రతిష్ఠ వేడుకలకు రమ్య హైదరాబాద్‌ను తిరిగి వచ్చింది. ఈ విషయం తెలుసుకున్న శ్రీనివాస్ మంగళవారం రాత్రి రంగశాయిపేటలోని అత్తారింటికి వెళ్లగా అతడిని చూసిన అత్తింటివారు తమఇంటికి ఎందుకొచ్చావని ప్రశ్నించడంతో.. వారికి శ్రీనివాస్‌కు మధ్య గొడవ ప్రారంభమై అది ఘర్షణకు దారి తీసింది. దీంతో శ్రీనివాస్‌పై భార్య, అత్త, మామ, బావమరిది నలుగురు కలిసి దాడిచేసి కళ్లల్లో కారం చల్లి, అక్కడున్న బండరాయితో తలపై బలంగా మోదారు. శ్రీనివాస్ కుప్పకూలడంతో.. ఇదే అదునుగా భావించి వారు అతడి మెడకు తాడును బిగించి బలంగా లాగడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. హత్య విషయం తెలుసుకున్న మిల్స్‌కాలనీ సీఐ పి.మల్లయ్య, ఎస్సై వెంకన్న బుధవారం ఉదయం సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. అల్లుడిని హత్య చేసిన మామ రమేష్, అత్త విజయ, భార్య రమ, బావమరిది అఖిల్ మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయినట్లు తెలుస్తుండగా.. దీనికి సంబంధించిన విషయాలను పోలీసులు ధ్రువీకరించడం లేదు. కాగా, మృతుడు శ్రీనివాస్ తండ్రి దుట్ట వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బజ్జూరి రమేష్, విజయ, రమ్య, అఖిల్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

హెల్మెట్ ధరించాలి : ఎస్ఐ

కురవి, ఫిబ్రవరి 14 : ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కురవి ఎస్సై గోపి కోరారు. జాతీయ రహదారి రోడ్డు భద్రత మాసోత్సవాలు పురస్కరించుకుని కురవిలో బుధవారం విద్యార్థులతో ర్యాలీ నిర్వ హించారు. ప్రతీ ఒక్కరు డ్రైవింగ్ చేస్తున్నప్పుడు తమ వ్యక్తిగత భద్రతపై దృష్టి పెట్టాలని, కారులో ప్రయాణిం చేవారు సీటుబెల్టును తప్పకుండా పెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు యాకయ్య, నరేష్ పాల్గొన్నారు.

- గార్ల : వాహన దారులు రోడ్డుపై ప్రయాణించేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై జీనత్ కుమార్ హెచ్చరించారు. గార్ల మండల కేంద్రంలోని పలు ప్రాంతాల్లో బుధవారం ముమ్మరంగా వాహనాలను తనిఖీ చేసి పలువురిపై కేసులు నమోదు చేశారు. ఎఎస్ఐ రవీందర్, సిబ్బంది మంగిలాల్, శ్రీను, రాయు పాల్గొన్నారు.

'అమర జవాన్ల త్యాగం మరువలేనిది'

తొర్రూరు, ఫిబ్రవరి 14 : జమ్మూకశ్మీర్ పుల్వామాలో 22 మంది వీర జవాన్లను బలిగొన్న ఘటన దురదృష్టకరమని, వారి త్యాగం మరువలేనిదని బీజేపీ తొర్రూరు అర్బన్ శాఖ అధ్యక్షుడు పల్లె కుమార్ అన్నారు. బుధవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో అమర జవాన్ల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రవిబాబు, పులేందర్, యాకయ్య, రాజేష్, నవీన్, విజయ్, రాజ్‌కుమార్, జగదీష్, సందీప్, హరి పాల్గొన్నారు.

పోరాట యోధురాలు సుష్మాస్వరాజ్

బీజేపీ ఎస్సీ మోర్చా పార్లమెంట్ ఇన్‌చార్జ్ రవిబాబు

తొర్రూరు, ఫిబ్రవరి 14 : కేంద్ర మాజీ మంత్రి బీజేపీ అగ్ర నేత సుష్మా స్వరాజ్ గొప్ప పోరాటయోధురాలని బీజేపీ ఎస్సీ మోర్చా మానుకోట పార్లమెంట్ ఇన్‌చార్జి అలిసేరి రవిబాబు అన్నారు. బుధవారం సుష్మా స్వరాజ్ జయంతి సందర్భంగా తొర్రూరు డివిజన్ కేంద్రంలో బస్టాండ్ సెంటర్‌లోని తల్లి తెలంగాణా విగ్రహం వద్ద ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుమార్, యాకయ్య, సందీప్, శ్రీనివాస్, నగేష్, హరీష్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

- జిల్లా ఉద్యాన అధికారి సూర్యనారాయణ

తొర్రూరు రూరల్, ఫిబ్రవరి 14 : ఆయిల్‌ఫాం సాగుచేసే ప్రతీ రైతు యాజమాన్య పద్ధతులు పాటిస్తేనే అధిక లాభాలు వస్తాయని జిల్లా హార్టికల్చర్ అధికారి సూర్యనారాయణ అన్నారు. బుధవారం తొర్రూరు మండలం కంఠాయపాలెం గ్రామంలో తొర్రూరు ఎంపీపీ అంజయ్య సాగుచేస్తున్న తోటలో ఆయిల్‌ఫెడ్ సంస్థ ఆధ్వర్యంలో రైతులకు పంట సాగు యాజమాన్య పద్ధతులపై అవగాహన కలిపించారు. ఎంపీపీ అంజయ్య, జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, జైన్ డ్రిప్ ఇరిగేషన్ జీఎం భవాని ప్రసాద్, హార్టికల్చర్ అధికారి రాకేష్, అయిల్‌ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్ వెంకట్‌కుమార్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.